


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం

వార్షిక విద్యుత్ మరమ్మతుల నిమిత్తం జేగురుపాడు, కడియం హెడ్ క్వార్టర్ ఫీడర్‌లకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ ఇఇ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మండలంలోని కడియం, జేగురుపాడు, కె.సావరం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. 33 కెవి చొప్పెల్ల, కడియపులంక ఫీడర్, 11 కెవి పొట్టిలంక ఫీడర్‌కు కూడా సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పొట్టిలంక గ్రామానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అధికార యంత్రాంగంతో సహకరించాలని ఆయన కోరారు.

3వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె గురువారం జిల్లావ్యాప్తంగా కొనసాగింది. తహశీల్దారు కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు, వర్కర్లు మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి తెరిపించి వారి సమ్మెను నిర్వీర్యం చేయడానికి అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేసింది.

ప్రజాశక్తి-యంత్రాంగం

చాగల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై సమ్మె చేస్తూ నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు కె.దుర్గారావు, గారపాటి వెంకట సుబ్బారావు, ఎస్.కె.ఆదం, రామనాథ మురళి మాట్లాడారు. సిఎం వైఎస్.జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించారన్నారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువగానే ఇస్తామని, రూ.5 లక్షల రిటైర్మెంట్ అలవెన్స్‌లు ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పూర్తి కావస్తున్నా రిటైర్‌మెంట్ అలవెన్స్ రూ.50 వేలు మాత్రమే వర్తింపచేశారు. అంగన్వాడీ అక్క చెల్లెమ్మలను సిఎం జగన్ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, నాదాల శ్రీరామ్ చౌదరి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.విజయ కుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, బి.మహాలక్ష్మి, ఎ.శ్రీదేవి, ఎస్.అరుణ కుమారి పాల్గొన్నారు. **సీతానగరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద కోరుకొండ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండలంలో 69 సెంటర్ల నుండి 138 మంది అంగన్వాడీ వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. వీరికి టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన నాయకులు బత్తుల వెంకట లక్ష్మి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బలక్ష్మి, సి.హెచ్.సువర్ణ, సుభాషిణి, ఉమాదేవి, ప్రశాంతి, వెంకట లక్ష్మి వెంకటేశ్వరి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో 63 మంది టీచర్లు, 61 మంది ఆయాలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సెక్టార్ లీడర్ ఎన్.రంగనాయకమ్మ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకులు సమ్మె ప్రాంతానికి చేరుకుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మీకుమారి, ఎం.జానకి, కెవిఎన్ఎస్.ప్రసన్నకుమారి, కె.విజయ కుమారి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు. **దేవరపల్లి** అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని గోపాలపురం మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అంగన్వాడీలను మోసం చేయడం దుర్మార్గమన్నారు. ధరలు పెరుగుతున్నా వేతనాలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు అనివేతతో సమస్యలు పరిష్కరించలేమని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సిఐటియు నాయకులు టిపి.లక్ష్మి, కె.లక్ష్మి, రైతు సంఘం నాయకులు పిన్నమనేని సత్యనారాయణ, ఐ.పద్మకామేశ్వరి, కె.గంగాభవాని, కె.కుమారి, డి.పద్మప్రియ, ఆర్.స్పందన పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మూడో రోజు నిరవధిక సమ్మె దీక్ష శిబిరాన్ని కొనసాగించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యమ్మ మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు, సిహెచ్.మాణిక్యాంబ, జిల్లా అధ్యక్షులు సిహెచ్.లక్ష్మి, పుష్పవతి, బొందపాటి వెంకట పద్మజ, టిడిపి నాయకులు జొన్నలగడ్డ సుబ్బయ్య చౌదరి, కంఠమని రామకృష్ణ, సూరపనేని చిన్ని, జనసేన పార్టీ నాయకులు టివి.రామారావు, తోర్లపాటి శీతల్, గాయత్రి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు కె.లక్ష్మి దగ్గర రాధాకృష్ణ ఐఎఫ్‌టియు నాయకులు పి.నాగేశ్వరరావు, గురునాథ్ మద్దతు తెలిపారు. **పెరవలి** తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరంలో సిఐటియు జిల్లా నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. అంగన్‌వాడీలకు టిడిపి, బిఎస్‌పి, జనసేన పార్టీలు మద్దతు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు అతికాల రామకృష్ణ, బిఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్ గుమ్మపుచిత్ర చేస్, నాయకులు వెన్నపు సుధాకర్, పులిదిండి నాగరాజు, చల్లాఅప్పల సత్యనారాయణ, నల్లి రమేష్, జాన్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ దర్వర్తి రవిచంద్ర, జనసేన నేత పిప్పర రవికుమార్, కోటిపల్లి మురళీకృష్ణ, దుర్గ, రామలక్ష్మి, శ్రీదుర్గ, కన్యాకుమారి, విజయ, పుణ్యవతి, జ్యోతి, నాగలక్ష్మి, రాణి, కృష్ణవేణి, విశాలి, సత్యాదేవి, సుజాత పాల్గొన్నారు. **గోపాలపురం** ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు నేత రామలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అంగన్వాడీలు తరలి వచ్చారు. **రాజానగరం** సాయిబాబా గుడి సమీపంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఎం.మార్తమ్మ పాల్గొన్నారు. **కడియం** సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సమ్మె చేపట్టారు. వీరికి కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని మద్దతు తెలిపారు.



ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీల నిరసన



తాళ్లపూడిలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులకొడుతున్న ప్రభుత్వ సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల ఆక్రమణ

అంగన్‌వాడీల సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ప్రయత్నించిం. పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కడియం మండలంలో 82 అంగన్వాడీ కేంద్రాలుండగా వాటిలో 75 కేంద్రాలను సచివాలయ ఉద్యోగులు తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకున్నారు. మరో 7 కేంద్రాల డోర్ కంబైడ్ తాళాలు ఉండటంతో స్వాధీనం కుదరలేదని అధికారులు తెలిపారు. **తాళ్లపూడి** ఆయా కేంద్రాలకు సంబంధించిన తాళాలను అధికారులు బద్దలు కొట్టారు. ఆయా కేంద్రాల రికార్డులు పరిశీలించారు. ఈ కేంద్రాల నిర్వహణ సచివాలయ, ఐకెపి శాఖల సిబ్బందికి అప్పగించారు. **ఉండ్రాజవరం** అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి, స్టాక్ పంచనామా నిర్వహించారు. ఎంపిడిఒ జివిఎస్‌ఆర్‌కె.రాజు మాట్లాడుతూ సమ్మె నిర్వహించినంత కాలం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం అందజేస్తామన్నారు. **సీతానగరం** వెలంపేట సెంటర్లో తాళాలు 11 మంది పిల్లలకు సమయం మించిపోయాక సాయంత్రం నాలుగున్నరకు పాయసం వండి పెట్టారు. **గోపాలపురం** అంగన్‌వాడీ కార్యాలయాలను తాళాలు పగలగొట్టి స్వాధీనం చేసుకున్నారు.



చాగల్లులో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



దేవరపల్లిలో అంగన్‌వాడీలకు మద్దతుగా కూర్చొన్న వివిధ పార్టీల నాయకులు



కొవ్వూరులో అంగన్‌శాడీల మానవహారం



సీతానగరంలో నిరసన శిబిరంలో నాయకులు, అంగన్‌వాడీలు



అధికారులతో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

పాలనా అంశాలపై జెసి సమీక్ష

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ, పశుసంవర్ధక, పౌర సరఫరాల అధికారులతో ఆయా శాఖల పనితీరుపై జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ గురువారం తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఏ ఒక్క అధికారి, సిబ్బంది విధుల పట్ల అలసత్వం చూపరాదన్నారు. ఇచ్చిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోలు వేగవంతం చెయ్యాల్సి ఉందన్నారు. ఎన్నికలు, ప్రకతి వైపరీత్యాల సందర్భంలో మరింత ఖచ్చితత్వం కలిగిన పని తీరు చూపడం కనీస బాధ్యత అన్నారు. సన్న కారు, చిన్నకారు రైతుల విషయంలోనే కాక పెద్ద రైతు విషయంలో సరైన సమయంలో స్పందించి సమస్య పరిష్కారం చెయ్యాల్సి ఉందన్నారు. రీ సర్వే ప్రక్రియలో రెండో దశ సర్వే ప్రక్రియను నిర్ధిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ కింద మొత్తం 48,283 లబ్ధిదారులు ఉంటారనే అంచనాలో ఇప్పటి వరకూ 2,995 మందిని అనుసంధానం చేసినట్టు చెప్పారు. పశు క్రాంతి కిసాన్ కార్డుల జారీ కోసం 17,621 మంది లబ్ధిదారులకుగాను ఇప్పటి వరకు 7,978 మంది వివరాలు నమోదు చేసి, వారిలో 1,326 మందికి కార్డులు జారీ చేశామన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలో కార్డులను జారీ చేయాలన్నారు. జిల్లాలో 1,556 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 1,541 కేంద్రాలను గురువారం సమ్మె నేపథ్యంలో తిరిగి ప్రారంభించినట్టు చెప్పారు. ఇంకా తెరవని 15 కేంద్రాలను ఆయా అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశాల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నగరంలోని గోకవరం బస్టాండ్ వద్ద గల సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం 36 గంటల మహా ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఆశాలు తరలివచ్చారు. ధర్నానుద్దేశించి ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ, కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడారు. గత ఎన్నికల ముందు సిఎం వైఎస్.జగన్ ఎన్నో హామీలు కురిపించారని, గద్దెనెక్కాక ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. కోవిడ్‌లో ఇల్లు, కుటుంబాలు వదిలి, ప్రాణాలు సైతం లెక్కచేయక ఆశా వర్కర్లు ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. కోవిడ్‌లో ఆశాలను పొగడ్తలతో ముంచెత్తారు తప్ప నయా పైసా వేతనం పెంచలేదన్నారు. సుప్రీంకోర్టు వేతన కార్మికులందరికీ గ్రాడ్యుటీ ఇవ్వాలని ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. ఆన్‌లైన్ వర్కులు యాప్‌లు, ఇతర వర్కులతో 24 గంటలూ పని చేస్తున్నా వచ్చే రూ.పది వేలతో కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. నెలలో కనీసం 10 రోజులు ఏదో ఒక మీటింగ్ పేరుతో ఇచ్చే జీతంలో సగం ప్రయాణాలకే సరిపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇప్పటికైనా కనీస వేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ఆన్‌లైన్ వర్కులు తగ్గించాలని, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆశాలు, అంగన్‌వాడీలు, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో పని చేసే స్కీమ్ కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మీద కక్ష కట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కనీసం మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల ముందు విపరీతమైన వాగ్దానాలు కురిపించి, ఎన్నికలయ్యాక బోడి మల్లన్న చందంగా జగన్ ప్రభుత్వం తీరు ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల.రాంబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఐద్వా జిల్లా నాయకులు టి.సావిత్రి, జరీనా షరీఫ్, స్రవంతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.అన్నామణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, ఎం.వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడారు. ధనలక్ష్మి, కొండ వెంకటలక్ష్మి, ఐ.వెంకటలక్ష్మి, రాజకుమారి, నాగమణి, హవేల, మేరీ, లక్ష్మి, సత్యవతి, లీల, దుర్గ, కోరుకొండ లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఆశా వర్కర్లు



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కార్మికుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

పరిశ్రమల్లో కార్మికుల హక్కులపై గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించబడిన వివిధ చట్టాల గురించి వివరించారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించడం, భద్రతా ప్రమాణాలు పాటించడం, హానికారక పరిస్థితుల్లో పని చేస్తున్న వారికి తరచుగా వైద్య పరీక్షలు చేయించడం పరిశ్రమల యాజమాన్యాల బాధ్యత అని చెప్పారు. కర్మాగారాల చట్టం, 1984 ప్రకారం సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ తమ అధికారిక పరిధిలో ఉన్న ఏ కర్మాగారాన్ని అయిన ఎప్పుడైనా తనిఖీ చేసేందుకు, ప్రమాదాలకు దారి తీసే యంత్రాలను స్వాధీనం చేసుకునేందుకు, రిజిస్టర్లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించేందుకు పూర్తి అధికారం కలిగి ఉంటారని వివరించారు. యాజమాన్యాలు వారి బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించనిచో చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సదస్సులో రాజమహేంద్రవరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్‌ఎం.వలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ జి.స్వాతి, వివిధ కర్మాగారల యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.



నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు

సమస్యలపై పోలవరం నిర్వాసితుల దీక్ష

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం గ్రామ శివారు గంగాలమ్మ గుడి సమీపంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి ఆధ్వర్యంలో పోలవరం ముంపు నిర్వాసితులు గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమణి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 72 రోజులపాటు సమస్యలపై పోరాటం చేశామని, కొద్దిమందికి మాత్రమే న్యాయం జరిగిందని, మిగిలిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని, మిగిలిన వారికి కూడా తగిన న్యాయం జరిగే వరకు ఈ నిరసన దీక్షలు ఆపేది లేదని తెలిపారు. దేవీపట్నం పునరావాస కాలనీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, వివాదంలో ఉన్న తొమ్మిది ఎకరాల ఇళ్ల స్థలాలను కాంట్రాక్ట్‌కు అప్పగించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పునరావాస ప్యాకేజీ వెంటనే చెల్లించాలని, గిరిజన, గిరిజనేతర నిర్వాసిత రైతులకు ఇవ్వవలసిన నష్టపరిహారం ఇవ్వాలని, పాదయాత్రలో నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇస్తానన్న జగన్ వెంటనే హామీ అమలు చేయాని, గ్రామాలు ఖాళీ చేసే సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌ఎలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, గోకవరం టిడిపి మండల అధ్యక్షుడు మంగరౌతు రామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి పాలూరి బోసుబాబు, కన్నబాబు, గుండా శివప్రసాద్ దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దా సత్యనారాయణ, గేదెల పెదసుబ్బారావు, గేదెల చినసుబ్బారావు, దొడ్డి సోమరాజు, లంక హరిచంద్రుడు, సిద్ధ వెంకన్న దొర, ముచ్చు నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న పోలవరం నిర్వాసితులు

16న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-నల్లజర్ల

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా మండల, నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు జెసి ఎన్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 16న వికాస, వన్ టీమ్ దూబచర్ల ఆధ్వర్యంలో 25 ఎంఎన్‌సి కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటి, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో 25 కంపెనీ లలో 1,500 ఉద్యోగాలు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులందరూ నవంబర్ 16 వ తేదీ శనివారం ఎలైట్ జూనియర్, డిగ్రీ కళాశాల దుబచర్లలో ఉదయం 9 గంటలకు సర్టిఫికేట్ జెరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

చంద్రశేఖరరావు దాతృత్వాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నున్న చంద్రశేఖరరావు దాతృత్వాన్ని అందరూ కొనసాగించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపు ఇచ్చారు. తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖరరావు ఇటీవల మరణించిన సంగతి విదితమే. పితవియోగంతో బాధపడుతున్న తిరుమలరావును మంత్రి వేణు, ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, గోరంట్ల బుచ్చియ్య చౌదరితో కలిసి గురువారం పరామర్శించారు. అనంతరం కాతేరులోని తిరుమలరావు స్వగృహంలో చంద్రశేఖరరావు పెద్దకార్యంలో వారు పాల్గొని ఆయన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులైన తిరుమలరావు, కృష్ణ, సురేశ్‌ను పరామర్శించారు. అనతంరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వేణు, ఎంఎల్‌ఎలు పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నున్న చంద్రశేఖరరావు సేవాగుణాన్ని మనం కూడా కొనసాగించాలన్నారు. ఎంయల్‌ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు విద్యాసంస్థను స్థాపించి ఎంతోమంది విద్యార్థులను గొప్ప ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆయన తండ్రి ప్రోత్సాహంతో ఎన్నో రక్తదాన శిబిరాలను, సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంయల్‌ఎ బూరుగుపల్లి శేషారావు, జక్కంపూడి గణేష్, శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కంటిపూడి సర్వారాయుడు, చెరుకూరి వీర్రాజు, బత్తుల బలరామకృష్ణ, శశి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బి.రవి కుమార్, గన్ని కృష్ణ, టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, కావూరి రవి, ఉండవల్లి ఉండవల్లి రాము, ఇమ్మని రామకృష్ణ, ఉప్పులూరి సత్యనారాయణ, పలువురు డాక్టర్లు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు, ఎంఎలఎ రాజా



పంట నష్టాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కేంద్ర బృందం పంట నష్టం పరిశీలన

ప్రజాశక్తి -దేవరపల్లి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. అంతర్గత మంత్రిత్వ శాఖ కేంద్ర బృందం (ఐఎంసిటి) సభ్యులైన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎడి మహేంద్ర చందేలియా, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయక కమిషనర్ చౌహాన్ సింగ్ మండలంలో నష్టపోయిన అరటిపంటను పరిశీలించారు. గ్రామంలో రైతులతో పంట నష్టాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంగాయిగూడెంలో కూలిపోయిన ఇంటిని పరిశీలించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామకృష్ణ, ఆర్‌డిఒ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారులు

మొలకెత్తిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తుపాను ప్రభావంతో మండలంలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించినట్లు రాజమహేంద్రవరం ఎఫ్‌సిఐ టెక్నికల్ అసిస్టెంట్ కె.సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని గురువారం పరిశీలించినట్లు తెలిపారు. పరిశీలించిన ధాన్యం శాంపిల్స్‌ను ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు. ధాన్యం శాంపిల్స్‌ను ఉన్నతాధికారులు పరీక్షించి, నష్టాన్ని అంచనా వేస్తారన్నారు. అంచనా వేసిన నష్టాన్ని బట్టి పరిహారం రైతులకు అందజేస్తారన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ మండలంలో 80 శాతం పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. పంట నష్టం స్వల్ప మాత్రమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉజ్జి వెంకట్రావు, బూరుగుపల్లి శివానందం, ఎపి పౌర సరఫరాల సంస్థ, రాజమహేంద్రవరం టెక్నికల్ అసిస్టెంట్ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపిఇఒ ఇంజేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సికి గోడ గడియారం అందజేత

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరానికి చెందిన బీమా గోల్డ్ జ్యుయలరీ బ్రాంచ్ మేనేజర్ షణ్ముఖ స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి పెద్ద గోడ గడియారం అందజేశారు. మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పెనుగొండ సత్యానందం గడియరాన్ని ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. షోరూం క్యాషియర్ ఎం.రాజేష్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ డి.శ్రీకాంత్ ఇంకా ఆసుపత్రికి అవసరమైనవి సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

కలవలపల్లిలో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద లేగ దూడల ప్రదర్శన, గర్భకోశ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఉప సర్పంచ్ కె.హరినాథ్ ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.సత్య గోవింద్ మాట్లాడుతూ రైతులకు లేగ దూడల పెంపకం, పశువుల గర్భకోశ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 55 లేగ దూడలను ప్రదర్శించారు. ప్రథమ బహుమతి వీరవెల్లి కృష్ణారావు ద్వితీయ బహుమతి గూడపాటి రామచంద్రరావు, తృతీయ బహుమతి సైద్‌బాజీకి అందజేశారు. 30 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స అందించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రాధాకృష్ణ, జి.జేసురత్నం, డాక్టర్ యు.ముఖేష్, రాజశేఖర్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమ్మెటివ్ టాపర్స్‌తో డిఇఒ అబ్రహాం, ఉపాధ్యాయులు

బాలికలు చదువులో ముందుండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాఠశాల స్థాయి నుంచి బాలికలు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థితికి వస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం సమ్మెటివ్-1 పరీక్షల్లో టాపర్స్‌తో ఆయన సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు బాలికలు ఉన్నత స్థితిలో ఉంటున్నారని, బాలురతో సమానంగా పోటీ పడుతున్నారని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి ఆర్థిక స్వాతంత్రాన్ని పొందుతారన్నారు. పదో తరగతి సమ్మెటివ్-1 పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన సిహెచ్.వెన్నెల, సాయి సమంత, షేక్ ఉన్నీసాను ఆయన అభినందించారు. మిగిలిన విద్యార్థులు వీరిని స్ఫూర్తి తీసుకొని, ప్రణాళికాబద్ధంగా చదువుకుని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు 16వ తేదీన తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సమ్మేటివ్-1 జవాబు పత్రాలను అందజేయాలన్నారు. టాపర్స్‌తో సెల్ఫీలు తీసుకుని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం బివి.శారదా దేవి, గణిత ఉపాధ్యాయిని బి.రాజ దీప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆక్రమణ

సమ్మెకు వ్యతిరేకంగా ప్రభుత్వం దుశ్చర్య
కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీల ఉద్యమంపై ప్రభుత్వం నిర్బంధ కాండకు తెరలేపింది. అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం హక్కుల సాధన కోసం సమ్మె చేపట్టిన విషయం విదితమే. సమ్మెలో భాగంగా మూడో రోజైన గురువారం మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలు కొనసాగాయి. అంగన్‌వాడీ ఆందోళనల పట్ల సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. అంగన్‌వాడీ సిబ్బందిపై బెదిరింపు చర్యలకు పాల్పడింది. జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తం 1,562 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలను సమీపంలోని సచివాలయాలకు మ్యాపింగ్ చేయించింది. జిల్లాలో 512 సచివాలయాల్లో సిబ్బందికి బాధ్యతలను అప్పజెబుతూ తాళాలు బద్దలు కొట్టి కేంద్రాల నిర్వహణ చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేయటంతో మున్సిపాల్టీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎంపిడిఒలు బాధ్యత తీసుకుని, సచివాలయ ఉద్యోగుల చేత ఈ పని చేయించారు. తాళాలు బద్దలు కొట్టే దుశ్చర్య గురువారం రాత్రి వరకూ కొనసాగింది. జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు అంగన్‌వాడీ కేంద్రాల తాళం పగలగొట్టి, కేంద్రాలను తెరచి అక్కడి ఫుడ్ తదితర వివరాలను పంచనామా ద్వారా రికార్డు చేశారు. పంచనామాను వివిఒ, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీస్ (వార్డు, గ్రామ, మహిళా సంరక్షణ కార్యదర్శి) నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 3,098 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరంతా తమ కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తూ మాతా, శిశు మరణాల రేటును తగ్గిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కీలక సేవలందిస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో సమ్మెబాట పట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలు తాళాలు పగలకొట్టి, వాటిని తెరవడం, అక్కడ సరుకుల లెక్కింపు, రికార్డు చేయడంతోపాటు, పిల్లలను రప్పించి అన్నం వండి పెట్టడం వంటి అదనపు పనులన్నీ సచివాలయాల సిబ్బందికి అప్పజెప్పటంతో వారిలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం వైపు దృష్టిపెట్టకుండా, ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించడం నియంతృత్వానికి అద్దం పడుతోందని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దుర్మార్గ వైఖరిని విడనాడాలి

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకోసం సమ్మె కొనసాగిస్తోంది. బాధ్యత గల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలి. దీనికి భిన్నంగా తాళాలు బద్దలు కొట్టి కేంద్రాలను నిర్వహించడం దుర్మార్గం. హిట్లర్ పరిపాలన తలపించేలా వైఎస్.జగన్ వ్యవహరిస్తున్నారు. ఇది సరైంది కాదు. ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయం. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

- ఎం.బేబీరాణి, జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్.



గోపాలపురంలో తాళాలు బద్దలు కొడుతున్న ప్రభుత్వ సిబ్బంది



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి

ప్రజాశక్తి-గోపాలపురం

జగన్మోహన్ రెడ్డి మొద్దు నిద్ర వీడి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి నష్టపోయిన రైతన్నలకు అండగా నిలవాలని గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పెద్దాపురంలోని రైతు కొర్లపాటి అన్నవరానికి చెందిన 20 ఎకరాల్లో కుళ్లిపోయిన పొగాకు తోటలను మద్దిపాటి వెంకటరాజు, టిడిపి నాయకులు పరిశీలించారు. అనంతరం వెంకటరాజు మాట్లాడుతూ ఇటీవల అకాల తుపాను కారణంగా రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. ప్రకతి విపత్తు ఒక కారణమైతే రెండోది ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అన్నారు. కాలువలు, చెరువులు పూడికలు తీయక పోవడంతో వర్షపు వరద నీరు ఒక గమ్యం లేకుండా పొలాల మీద విరుచుకు పడడంతో పొలాలు కొట్టుకుపోవడం, తోటలు కుళ్లిపోవడం పంట నష్టం వాటిల్లిందన్నారు. పొగాకు తోటలు కుళ్లిపోవడంతో రైతులకు ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. సిఎం వైఎస్.జగన్ మొద్దు నిద్ర వీడి క్షేత్రస్థాయిలోకి వచ్చి పొగాకు బోర్డు అధికారులతో, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి రైతులకు పంట పెట్టుబడికి రుణాలు ఇప్పించి, పంట నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి రాము, గన్నిన మురళి, రొంగల సత్యనారాయణ, జ్యేష్ట శ్రీనివాస, శ్రీధర్, మద్దిపాటి రమేష్, పరిమి జగదీష్, దొరబాబు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన జెసి తేజ్ భరత్

ఇంధనాల వినియోగంపై బాధ్యత అవసరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంపై వినియోగదారుల్లో, గృహాల్లో, పరిశ్రమల్లో, వ్యాపార సముదాయాల్లో యువతకు అవగాహన కల్పించాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహించనున్న జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలను గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో పొదుపు చర్యలు తప్పనిసరిగా పాటించాలని, తద్వారా భవిష్యత్ తరాలకు బొగ్గు, గ్యాస్, క్రూడాయిల్ వంటి శిలాజ ఇంధనాలు వినియోగం తగ్గించి రేపటి తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంధన వనరుల మీద అత్యంత శ్రద్ధ కనబరుస్తోందని ఆమేరకు యువత, ముఖ్యంగా విద్యార్థులను ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. విద్యుత్ వినియోగం బాగా పెరగడం వల్ల సహజ వనరుల పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించేందుకు విద్యుత్‌ను పొదుపు చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యుత్ సరఫరా చేయడానికి, జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు విద్యుత్ పొదుపును అమలు చేయటానికి కంకణం కట్టుకుందన్నారు. మనందరం ఇందులో భాగస్వామ్యం అవుదామన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఇ టి.వి.ఎస్.ఎన్. మూర్తి, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, ఇఇలు బి.వీరభద్ర రావు, డి.శ్రీధరవర్మ, ఎన్.శ్యాముల్, డిఇ ఎస్.దేవయ్య, టి.గాబ్రియల్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

లబ్ధిదారుల జాబితా కలెక్టర్‌కు అందజేత

ప్రజాశక్తి - యానాం



సముద్రంలో ఒఎన్‌జిసి వేస్తున్న రెండో గ్యాస్ పైప్‌లైన్ వల్ల నియోజకవర్గంలో ఉపాధి కోల్పోయిన లబ్ధిదారుల జాబితాను పుదుచ్చేరి కలెక్టర్‌కు నివేదించినట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితా-ఎ, బిలు కలిపి 5,462 మందికి రూ.132 కోట్ల 36 లక్షల 75 వేల 880 లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. నష్ట పరిహారం అందుకునే లబ్ధిదారుల సంఖ్య 4,570 మందిగా గుర్తించారని, వీరిలో పురుషులు 4,067 మంది, 503 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వీరికి నెలకు రూ.11,500 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. నష్టపరిహారానికి సిఫార్స్ చేసిన బి జాబితాలో 892 మందిని చేర్చినట్లు తెలిపారు. చిన్న వయసు కలిగిన 66 మందికి రూ. కోటి 24 లక్షల 94 వేల 20లు, విద్యార్థులు కాని వారు 182 మందికి రూ.4 కోట్ల 38 లక్షల 43వేల 60లు, ప్రాజెక్టు అమలు చేసే సమయంలో సొసైటీలు, అండర్ టేకింగ్‌లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న 21 మందికి రూ.35 లక్షల 9 వేల 800లు, ఒంటరి మహిళలకు, పరస్పరం విడిగా ఉంటున్న మహిళలు 24 మందికి రూ. 60 లక్షల 72 వేలు, డూప్లికేషన్ కేసులు 115 మందికి రూ.2 కోట్ల 90 లక్షల 95 వేలు, లేబర్ ఆఫీసులో నమోదు చేసుకున్న 173 మందికి రూ.4 కోట్ల 37 లక్షల 69 వేలు, ఫిషింగ్ కాకుండా ఇతర వృత్తులు చేసే 311 మందికి రూ.7 కోట్ల 86 లక్షల 83 వేలు పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - యానాం



ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

డిమాండ్ల సాధన కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె లో కాకినాడ డివిజన్ సహాయ కార్యదర్శి ముమ్మిడివరపు బుల్లియ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయపరమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని కోరారు. గ్రామీణ తపాల ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించి ఎనిమిది గంటల పని, మెడికల్‌కి రూ.5 లక్షలు, పెన్షన్ రూ.ఐదు లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు అమలు చేసే వరకూ నిరవధిక సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిపిఎం నాగేశ్వరరావు, సుబ్బారావు, శశి, దివ్యకుమార్, దుర్గాలక్ష్మి, భాను తేజ, భవాని శంకర్, అభి, స్వాతి పాల్గొన్నారు.

జనవరి 14 నుంచి బీచ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యానాంలో జనవరి 14,15,16 తేదీల్లో మూడు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్, ఫ్లవర్ షో నిర్వహిస్తామని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలు స్థానిక గౌతమీ గోదావరి రాజీవ్ రివర్ బీచ్ వద్ద జరుగుతాయన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. వీటిని విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో పిఎం ఆవాస్ యోజన పథకంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గురువారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పంపిణీ చేశారు. మొదటి, రెండవ, మూడో విడతకి సంబంధించి సుమారు 31 మందికి రూ.34.30 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.




గడప గడపకు కార్యక్రమంలో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

రఘుదేవపురంలో గడప గడపకూ..

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో గడప గడపకు వైసిపి కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి వైఎస్.జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్య లను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా శ్రీను, పెదపాటి రమేష్ బాబు, ఎంపిపి గుర్రాల జ్యోత్స, సుజీరాజు, పట్టపగలు విష్ణు ప్రసాద్, గెద్దాడ త్రిమూర్తులు, ఇందుగుమిల్లి చంద్రలీల, పాలచర్ల అచ్యుతరామయ్య, పంతుల శ్రీను, వెలమాటి కాశీ విశ్వనాథం, చుండ్రు శ్రీను, నిడదవోలు శ్రీనివాస్, సుంకర సూర్యచంద్రం, పిండి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

విప్పర్తి రామ్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కుమారుడు విప్పర్తి రామ్ వివాహం రిసెప్షన్‌లో పలువురు వారికి అభినందనలు తెలిపారు. వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా శ్యామ్‌బాబు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, వైసిపి కన్వీనర్లు తలారి ప్రసాద్, బూసి కృష్ణ, జాన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిటిఆర్ఐ ఆధ్వర్యాన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-రాజానగరం



సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సిటిఆర్ఐ), ఇండియన్ సొసైటీ ఆఫ్ టొబాకో సైన్స్ ఆధ్వర్యాన గురువారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. పొగాకు, వాణిజ్య వ్యవసాయం కోసం సంసిద్ధత అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. సిటిఆర్ఐ డైరెక్టర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ టొబాకో సైన్స్ ప్రెసిడెంట్, డాక్టర్ ఎం.శేషుమాధవ్ స్వాగతోపన్యాసం చేశారు. అంతర్జాతీయ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. 75 ఏళ్లుగా పొగాకు రైతుల పురోభివృద్ధికి సిటిఆర్ఐ ప్రశంసనీయమైన పరిశోధనలు చేసిందన్నారు. సంస్థ అభివృద్ధి చేసిన సాంకేతికతలు, పరిజ్ఞానం పొగాకు ఉత్పత్తి, నాణ్యతను గణనీయంగా పెంచిందన్నారు. తద్వారా విదేశీ మారక ద్రవ్యం పెరిగి భారతీయ ఆర్థిక వ్యవస్థలో పొగాకు పంట కీలక పాత్ర పోషించిందన్నారు. పొగాకు పంటతో పాటు భారతదేశం ముఖ్యమైన వాణిజ్య పంటల ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రముఖ స్థానంలో ఉందన్నారు. పొగాకుతో పాటు మిరప, పసుపు, ఆముదం, అశ్వగంధ వంటి ముఖ్యమైన వాణిజ్య పంటలను చేర్చడం ద్వారా ప్రస్తుతం జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థగా రూపుదిద్దుకుందన్నారు. ఐసిఎఆర్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ పరిశ్రమలకు, రైతులకు పరిశోధనా సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. రైతులు, పరిశ్రమలు, పొగాకు బోర్డు, ఇతర వాటాదారుల అవసరాలను తీర్చడానికి కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ కృషి చేస్తోందన్నారు. ఐసిఎఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.దినేష్, వైఎస్ఆర్ ఉద్యాన వర్శిటీ విసి డాక్టర్ టి.జానకీ రామ్, నన్నయ విశ్వవిద్యాలయం విసి డాక్టర్ కె.పద్మరాజు, ఐటిసి వైస్ ప్రెసిడెంట్ జి.కృష్ణకుమార్, డాక్టర్ షేక్ ఎన్.మీరా తదితరులు మాట్లాడారు. ఈ తర్జాతీయ సదస్సులో దేశంలోని నలుమూలల నుంచి శాస్త్రవేత్తలు, హార్టికల్చరల్, అగ్రికల్చరల్ యూనివర్సిటీల శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు



అంగన్‌వాడీల సమ్మెపై అధికారుల సమీక్ష

ప్రజాశక్తి- గోకవరం

మండల కార్యాలయంలో ఎంపిడిఒ కె.పద్మజ్యోతి ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, సిఆర్‌పిలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ సెంటర్లకు ఇద్దరు గ్రామ వాలంటీర్లు, ఒక మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒలు ఆయా అంగన్వాడీ సెంటర్లకు వెళ్లి పంచనామాలు జరిపి సెంటర్ తెరచి ప్రతిరోజు అంగన్వాడీ వర్కర్స్ విధులు, బాలింతలు, గర్భిణిలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామన్నారు. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా సెంటర్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాజేశ్వరరావు, గోకవరం ఎస్ఐ శివ నాగబాబు పాల్గొన్నారు.